నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, బుధవారం 18 డిసెంబర్ 2024 | KAMAREDDY


రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కారు

- లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో గులాబీ శ్రేణుల నిరసన
- అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ

# గిరిజనులపై ప్రతాపమా?

ఖలీల్‌వాడి/కామారెడ్డి, డిసెంబర్ 17: ఫార్మా సిటీకి భూములు ఇవ్వని గిరిజన రైతులపై ప్రభుత్వం ప్రతాపం చూపించి అక్రమంగా నిర్బంధించడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. రైతులకు సంఘీభావంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరాచకాల నుంచి లగచర్ల రైతన్నలను కాపాడాలని కోరుతూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నేతలు నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారన్నారు. లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, అక్రమంగా నిర్బంధించారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయన్నారు. నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, తెలంగాణ శంకర్, కరిపె రాజు, చింతకాయల రాజు, భాస్కర్, భూపతి, కృష్ణ, సాదిక్, నీలగిరి రాజు, గాండ్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

**కేసులు ఎత్తివేయాలి..**

లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కామారెడ్డిలో గులాబీ శ్రేణులు నిరసన చేపట్టాయి. రైల్వే కమాన్ బ్రిడ్జి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన రైతుల భూములను అక్రమంగా లాక్కోవడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. గిరిజనులకు మద్దతుగా బీఆర్ఎస్ ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. గిరిజన రైతులతో పాటు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపైనా పెట్టిన కేసులను ఎత్తివేసి, వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు చెలిమల భానుప్రసాద్, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, కృష్ణాజిరావు, జాగృతి జిల్లా అధ్యక్షుడు అనంతరాములు, మల్లేశ్ యాదవ్, కృష్ణ యాదవ్, సంగిమోహన్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మేయర్ నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ నేతలు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

బిచ్కుంద మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే



## భూములు లాక్కునేందుకే కుట్ర

- లగచర్ల రైతులపై కేసులు ఎత్తేయాలి
- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, డిసెంబర్ 17: ఫార్మాసిటీ పేరిట గిరిజనుల భూములు లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. భూములు ఇవ్వమన్నందుకు లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి అక్రమంగా జైలులో నిర్బంధించారన్నారు. గిరిజన రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బిచ్కుంద మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన అనంతరం షిండే మాట్లాడారు. రాష్ట్రంలో రైతన్నలపై అరాచకాలు, అణచివేతలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రల నుంచి లగచర్ల రైతన్నలను కాపాడాలన్నారు. గిరిజనుల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు. అందుకోసమే ఫార్మా సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పేర్లతో మాయమాటలు చెబుతూ, ఎలాగైనా భూములు లాక్కుని తన అల్లుడికి అప్పజెప్పాలని సీఎం యత్నిస్తున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వమన్న రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్, ఉపాధ్యక్షుడు నాల్చర్ శ్రీనివాస్, రాంచందర్, నాల్చర్ రాజు, మల్లికార్జున్, బస్వరాజ్ పటేల్, సంజూపటేల్ తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# మాఫీ రాలేదు.. బ్యాంకు ఊరుకోలేదు

- వడ్ల డబ్బులు పంట రుణం కింద కొట్టేసుకున్న వైనం
- మహిళా రైతుకు తీరని అన్యాయం



రుణం కింద కట్ చేసుకున్నట్లు చూపిస్తున్న అకౌంట్ స్టేట్‌మెంట్

ధర్పల్లి, డిసెంబర్ 17: రుణమాఫీ చేయకుండా సర్కారు మోసం చేసింది.. పంట రుణం కింద వడ్ల డబ్బులు కొట్టేసుకుని బ్యాంకు చేతులు దులుపేసుకుంది. ఏం చేయాలో, ఎవరిని నిందించాలో తెలియక ఓ రైతు కుటుంబం దిగాలు చెందుతున్నది. రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కారు దమన నీతికి అద్దం పట్టే ఈ ఉదంతం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం చల్లగరిగెలో చోటు చేసుకుంది. రైతు దంపతులు ఎం.రాజేశ్వర్, గంగాజమునకు ధర్పల్లిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో జాయింట్ అకౌంట్ ఉంది. గతంలో గంగాజమున రూ.75 వేల పంట రుణం తీసుకున్నారు. అయితే, పంట రుణాలు చెల్లించొద్దని, తమ ప్రభుత్వం రాగానే మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలంతా హామీలు గుప్పించడంతో రాజేశ్వర్ దంపతులు ఆ రుణం సంగతి మరిచిపోయారు. అయితే, ఇటీవల వడ్లు విక్రయించగా, ఈ నెల 5న రాజేశ్వర్,గంగాజమున జాయింట్ అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యాయి. ఇదే అదనుగా తమ పంట రుణాన్ని వసూలు చేసుకోవాలనుకున్న ఐవోబీ బ్యాంక్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఈ నెల 11వ తేదీన జాయింట్ అకౌంట్ నుంచి రూ.1,06,265 కట్ చేసుకున్నారు. తర్వాతి రోజు గంగాజమున డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లగా, ఖాతాలో డబ్బులు తక్కువగా ఉండడం చూసి ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఆమె తన సోదరుడికి చెప్పగా, అతడు వెళ్లి బ్యాంకులో ఆరా తీశాడు. పంట రుణం కింద కట్ చేసుకున్నట్లు వారు బదులిచ్చారు. మొండి బకాయి ఉండడంతో ఆటోమెటిక్‌గా డబ్బులు కట్ అయ్యాయని బ్యాంక్ మేనేజర్ చెప్పారు. ఖాతాదారులకు చెప్పకుండా, ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఎలా తీసుకుంటారని ప్రశ్నించగా, అసహనానికి గురైన బ్యాంక్ అధికారులు తాము చేసేదేమీ లేదని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని దబాయించారని బాధితులు 'నమస్తే తెలంగాణ'తో వాపోయారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా తమను మోసం చేసిందని, పంట అమ్మగా వచ్చిన డబ్బులు కాస్త బ్యాంకులో రుణం కింద పట్టుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు, ఈ వ్యవహారంపై బ్యాంకు మేనేజర్ రాజును వివరణ కోరగా.. పంట రుణం మొండి బకాయి కింద పడిందని, వారికి రెన్యూవల్ చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. డబ్బులు తప్పక పట్టుకోవాల్సి వచ్చిందన్న ఆయన.. మళ్లీ కొత్తగా రుణం ఇస్తామని చెప్పారు. అయితే నోటీసులు ఇవ్వకుండా డబ్బులు కట్ చేస్తారని ప్రశ్నిస్తే, నోటీసులు సైతం పంపామని, వాటికి సంబంధించిన వివరాలు వెతుకుతున్నామని చెప్పారు.

**సర్కారు ఝుటా మాటలు..**

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేశామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. రైతులను రుణ విముక్తుల్ని చేశామని ఝూటా మాటలు చెప్పుకుంటున్నది. దేశంలో ఎవరూ చేయనట్లు తామే చేశామని చాటింపు వేయిస్తున్నది. కానీ క్షేత్ర స్థాయిలో చూస్తే సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్న విషయం వెలుగు చూస్తున్నది. అందుకు గంగాజమున ఉదంతమే తాజా ఉదాహరణ. రూ.2 లక్షలలోపు రుణమాఫీ దేవుడెరుగు.. సదరు మహిళా రైతు తీసుకున్న రూ.75 వేల రుణాన్ని కూడా మాఫీ చేయకుండా ఎగ్గొట్టిన వైనం సర్కారు దమననీతికి చక్కటి నిదర్శనం.

**నోటీసులు ఇవ్వలే..**



ఐవోబీలోని జాయింట్ అకౌంట్‌లో వడ్ల డబ్బులు జమ అయ్యాయి. నా భార్య పేరిట ఉన్న పంట రుణం కింద డబ్బులు కట్ చేసుకున్నారు. కనీసం మాకు సమాచారం ఇవ్వలేదు. ఎలాంటి నోటీసు కూడా ఇవ్వలేదు. మాకు రుణమాఫీ అయితదని చెప్పినా వినకుండా బలవంతంగా డబ్బులు పట్టుకోవడం అన్యాయం. ఇదేందని అడిగితే మేనేజర్ దబాయిస్తున్నారు.


**- రాజేశ్వర్, రైతు, చల్లగరిగె**

# బిల్లులెందుకు చెల్లించరు?

ఆదాయం వస్తున్నా.. అప్పులు తెస్తున్నా బిల్లులు మాత్రం చెల్లించట్లేదు

అసెంబ్లీలో ప్రభుత్వంపై మండిపడ్డ వేముల

మోర్తాడ్, డిసెంబర్ 17: చిన్నచిన్న బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం గడిచినా ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదని, ఆరు గ్యారంటీలు 13 హామీల ఊసే లేదని విమర్శించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. బిల్లుల చెల్లింపులో జాప్యంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రానికి ఆదాయం వస్తుంది.. అప్పులు తెస్తున్నారు.. అయినా చిన్నచిన్న బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 1.27 లక్షల కోట్ల అప్పు తెచ్చారు. సంవత్సర కాలంగా రాష్ట్రానికి ఆదాయం వస్తున్నా.. సీడీపీ, ఎస్‌డీఎఫ్ ద్వారా చేపట్టిన చిన్న చిన్న పనులకు కూడా బిల్లులు ఎందుకు క్లియర్ చేయడం లేదని అడిగారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే కుల సంఘాల భవనాలు, మహిళా భవనాలు, కల్యాణ మండపాలు, బడులు.. ఇలా 143 పనులకు రూ.6 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు చెల్లించలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. 33 గుడులకు రూ.3 కోట్ల బిల్లులు చెల్లించలేదని చెప్పారు. ఇది ఒక్క బాల్కొండ నియోజకవర్గం పరిస్థితి కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు ఉన్న సమస్యనే అని చెప్పారు. చిన్నచిన్న పనులు చేసింది కాంట్రాక్టర్లు కాదని, విద్యాకమిటీలు, కుల సంఘాలు, మహిళాసంఘాల వాళ్లు కూడి కట్టించుకున్నారని తెలిపారు. ఇటువంటి చిన్న బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించక పోవడం కారణంగా పనులు చేసిన వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు.



అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


# ఎవరైతే మాకేంటి?

కలెక్టర్ చెప్పినా వెనక్కి తగ్గేదేలే!

- పెద్దవాగులో ఆగని అక్రమ తవ్వకాలు
- మంగళవారం ఉదయం వరకు ఇసుక తరలింపు
- కలెక్టర్ సీరియస్ అయినా పట్టని యంత్రాంగం
- అధికార పార్టీకి మడుగులొత్తుతున్న వైనం
- తక్కువ ధర కోసమేనని కాంగ్రెస్ నేతల ప్రచారం

మంగళవారం తెల్లవారు జామున గాండ్లపేట్ నుంచి మోర్తాడ్ వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్






వాట్సప్‌లో కాంగ్రెస్ నేతలు పెట్టిన పోస్టులు

మోర్తాడ్, డిసెంబర్ 17: ఎవరు సీరియస్ అయితే మాకేంటి? రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెప్పాం.. అంతకు రెట్టింపు సంపాదించాలి కదా? అందుకే ఎవరు చెప్పినా వెనక్కి తగ్గేదేలే.. ఇసుక తవ్వకాలు ఆపేదేలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు ఇసుకాసరులు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక దోపిడీ ఆపడం లేదు. కలెక్టర్ సీరియస్ అయినా వెనక్కి తగ్గడం లేదు. మంగళవారం తెల్లవారు జాము వరకూ వందల కొద్దీ ట్రిప్పుల ఇసుకను తరలించుకు పోయారు. పైగా ఈ ఇసుకను తహసీల్ కార్యాలయానికి పక్కనే ఉన్న వెంచర్‌లో డంప్ చేయడం గమనార్హం.

**చీకట్లో దోపిడీ..**

ఇసుక తవ్వకాల కోసం గాండ్లపేట్ వీడీసీకి రూ.18 లక్షలు, మోర్తాడ్ శివారులో డంప్ చేస్తున్నందుకు రూ.5 లక్షలు, అధికారులకు భారీగా ముడుపులు చెల్లించిన అధికార పార్టీ నేతలు చీకటి పడితే చాలు పెద్దవాగులో జేసీబీలు, ట్రాక్టర్లతో వాలిపోతున్నారు. జాతీయ రహదారి మీదుగానే తరలించుకు పోతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులను మచ్చిక చేసుకోవడంతో వారు పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించడం, కలెక్టర్ సీరియస్ కావడంతో కదిలిన రెవెన్యూ అధికారులు సోమవారం డంప్‌లు సీజ్ చేసినట్లు చూపించారు. కానీ, అదే రోజు రాత్రి మళ్లీ పెద్దవాగు నుంచి ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరిగాయి. మంగళవారం ఉదయం వరకూ తరలించిన ఇసుకను తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న వెంచర్లో డంప్ చేశారు. అయినా అటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు.

**తక్కువ ధరకేనంటూ..**

గాండ్లపేట్ నుంచి అక్రమ తవ్వకాలు చేపట్టిన అధికారపార్టీ నాయకులు.. తక్కువ ధరకే ఇసుక విక్రయిస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ మేరకు గ్రామాల్లో ఉండే వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. పైగా నియోజకవర్గ స్థాయి నేత ఆదేశాల మేరకే ఇసుక తరలింపు జరుగుతున్నదని అందులో పేర్కొనడం గమనార్హం. తక్కువ ధరకే ఇసుక అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. వాస్తవానికి జరుగుతున్నది మరోలా ఉన్నది. అక్రమంగా డంప్ చేస్తున్న ఇసుకను లారీల్లో పట్టణాలకు తరలించి అధిక ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు లారీలో ఇసుక తరలిస్తూ ఇటీవలే పట్టుబడిన సంగతి తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టి అక్రమ వ్యాపారం చేస్తూనే ప్రజలకేమో తక్కువ ధరకే ఇసుక అని కలరింగ్ ఇస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తూ భారీగా దండుకుంటున్నారు. మరోవైపు నీళ్ల నుంచే ఇసుక తోడేస్తుండడంతో జాతీయ రహదారి పూర్తిగా తడిసిపోయి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



మోర్తాడ్ తహసీల్ కార్యాలయం పక్కనే ఉన్న వెంచర్‌లో డంప్ చేసిన ఇసుక

# జీపీ కార్మికుల నిర్బంధం

- పలు మండలాల్లో ముందస్తు అరెస్టులు
- పోలీసు స్టేషన్‌కు తరలింపు




రామారెడ్డిలో గ్రామ పంచాయతీ సిబ్బందిని ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నిజామాబాద్, డిసెంబర్ 17: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్మికులు మంగళవారం చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. పలు మండలాల్లో పంచాయతీ కార్మికులతోపాటు కార్మిక సంఘాలు, వామపక్ష నేతలను వేకువ జామున నిర్బంధించారు. ఇందల్వాయి, మోర్తాడ్, నందిపేట్, బోధన్, నవీపేట్, రుద్రూర్, కోటగిరి, రామారెడ్డి, బీబీపేట, బిచ్కుంద మండలాల్లోని పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రజా పోరాటాలను అణిచివేయాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## నిందితుడి అనుమానాస్పద మృతి

- ఠాణాలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం
- జ్యుడీషియల్ విచారణ షురూ

రెంజల్, డిసెంబర్ 16: ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఉన్నతాధికారులు జ్యుడీషియల్ విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు కలుగుతున్నాయి. రెంజల్ మండల పరిధిలోని ఓ తండాకు చెందిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడ్ని గురువారం రాత్రి రెంజల్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారిస్తున్న క్రమంలోనే అతడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కానీ నిందితుడు ఠాణాలోనే ఆత్మహత్య చేసుకున్నాడని, తన నడుముకు ఉండే దారంతో ఉరేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం రిపోర్టు, జ్యుడీషియల్ విచారణ నివేదిక వచ్చాక సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశముంది. జ్యుడీషియల్ విచారణ కొనసాగుతున్న మాట వాస్తవమేనని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.